




వికారాబాద్ మండలం గంగ్యాడలో నీట మునిగిన పత్తి చేను

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి. ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షంతో ఆదివారం రైతులు, కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన జొన్న నెలకొరిగింది. పత్తి, వరి చేలు నీట మునిగాయి. గడిచిన 24 గంటల్లో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో అత్యధికంగా 208.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఫరూక్‌నగర్ మండలంలో చేపలు పట్టేందుకు చెరువులోకి దిగిన వ్యక్తి దుర్మరణం చెందగా, షాద్‌నగర్ నోబుల్ పార్క్ కాలనీలో వర్షపు నీటి గుంటలో పడి బాలుడు దుర్మరణం చెందాడు. తాండూరు నియోజకవర్గంలో అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అల్లాపూర్ వంతెనపై వరద ఉధృతికి లారీ అదుపుతప్పి కొట్టుకుపోయింది. బషీరాబాద్ మండలం జీవన్గిలోని మహదేవ లింగేశ్వర దేవాలయం పూర్తిగా నీట మునిగింది. మేడ్చల్‌లో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. కాగా, రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


బషీరాబాద్ మండలం జీవన్గి వద్ద జలదిగ్బంధంలో మహాదేవలింగేశ్వర ఆలయం


ఆమనగల్లులో నేలకొరిగిన జొన్న చేను

వానా.. హైరానా!

ఉమ్మడి జిల్లాలో తెరపి లేకుండా కురుస్తున్న వర్షం

- ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ, మూసీ వాగులు
- స్తంభించిన జనజీవనం.. జలదిగ్బంధంలో లోతట్టు ప్రాంతాలు
- తొమ్మిదిరేకుల గ్రామంలో అత్యధికంగా 208.5 మి.మీ వర్షపాతం
- ప్రాజెక్టులు, చెరువుల్లోకి భారీగా చేరుతున్న వరద నీరు
- నీట మునిగిన జీవన్గి మహాదేవ లింగేశ్వర దేవాలయం
- అల్లాపూర్ వాగులో కొట్టుకుపోయిన లారీ
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు.. పదుల సంఖ్యలో కూలిన ఇళ్లు
- అనేక గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- దేవనపల్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి.. షాద్‌నగర్‌లో బాలుడి దుర్మరణం
- వరద ఉధృతికి తెలంగాణ - కర్ణాటకకు రాకపోకలు బంద్


పరిగిలో నస్కల్ వాగు ఉధృతి

ఆంధ్రజ్యోతి, ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, సెప్టెంబరు1: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి చేవెళ్ల మండలంలోని దేవరాంపల్లి (ఈసీ) వాగు, షాబాద్ మండలంలోని తాళ్లపల్లి వాగు, శంకర్‌పల్లి మండలంలోని ఫతేపూర్ (మూసీ) వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ వాగు, కొందుర్గు మండల పరిధిలోని వెంకిర్యాల-తంగళ్ళపల్లి వాగు ఉగ్రరూపం దాల్చడంతో వెంకిర్యాల, తంగళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొందుర్గు మండలం వాల్మీకి కాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. చెరువులు, కుంటలు నిండాయి. చెక్ డ్యాంలు అలుగు పారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. రహదారులన్నీ జలమయం కావడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గడిచిన 24 గంటల్లో కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో అత్యధికంగా 208.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఫరూక్‌నగర్ మండలం దేవనపల్లి గ్రామంలో

మిగతా 7వ పేజీలో...


తాండూరు మండలం మల్కాపూర్ భవానీ కాలనీలో ఇళ్ల మధ్య చేరిన నీరు

జలాశయాలకు పర్యాటకుల తాకిడి

ఎడతెరపి లేకుండా వర్షం కురియడంతో పర్యాటకులు అనంతగిరికి భారీగా తరలి వచ్చారు. వర్షం కురుస్తున్నా.. అనంతగిరి కొండల్లో ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ సందడి చేశారు. జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు అలుగెత్తి ప్రవహిస్తుండడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రాజెక్టులు, చెరువులు మత్తడి పోస్తుండడంతో సందర్శకులు, పర్యాటకులు వెళ్లి వీక్షిస్తున్నారు. కోట్‌పల్లి, లక్నాపూర్, శివసాగర్, జుంటుపల్లి, నందివాగు, సర్పన్‌పల్లి ప్రాజెక్టులకు సందర్శకుల తాకిడి పెరిగింది. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అనంతగిరికి వచ్చే సందర్శకులు కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. అనంతగిరి అటవీ ప్రాంతానికి కూడా పోటెత్తారు. అటవీ ప్రాంతంలో పైనుంచి కిందకు ప్రవహించే వాటర్ ఫాల్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

ఉప్పొంగిన చెరువులు, కుంటలు

కేశంపేట మండలంలో భారీ వర్షం కురిసింది. కొండారెడ్డిపల్లి చెరువు, చౌలపల్లి పెద్ద చెరువులో భారీగా వరద నీరు చేరింది. పెద్దవాగు ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొందుర్గు మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. అలాగే మండల పరిధిలోని వెంకిర్యాల - తంగళ్లపల్లి మధ్యన ఉన్న వెంకిర్యాల వాగు పొంగిపొర్లుతుండడంతో తంగళ్లపల్లి, వెంకిర్యాల, ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లి, జిల్లేడ్ - చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్ తాండ, కాస్లాబాద్, రావిర్యాల, ఎదిర, ముష్టిపల్లి గ్రామాలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల పరిధిలోని కొల్లూరు, చౌడుర్ గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి.


రంగారెడ్డి జిల్లా దేవరంపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

నదిలో కొట్టుకుపోయిన డ్రైవర్, క్లీనర్ సురక్షితం

తాండూరు మండలం అల్లాపూర్ వంతెనపై అర్ధరాత్రి ఔరంగాబాద్ నుంచి ఇనుపసీకుల లోడ్‌తో చెన్నై వెళుతున్న లారీ అదుపుతప్పి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో డ్రైవర్ ఉమేశ్, క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు. బషీరాబాద్ మండలం, జీవన్గిలోని మహాదేవ లింగేశ్వర దేవాలయం జలదిగ్బంధంలో ఉండిపోయింది. కాగ్నా నది ఉధృతంగా ప్రవహించడంతో ఒడ్డున ఉన్న ఈ దేవాలయం సగానికి పైగానే మునిగిపోయింది.


కొడంగల్‌లో వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్


వికారాబాద్‌లో అలుగుపారుతున్న శివసాగర్


అలుగు పారుతున్న మేడ్చల్ పెద్ద చెరువు


రంగారెడ్డి జిల్లా కాకునూరులో కూలీని ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు


ధర్నా చేస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1: సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందేనని జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామారావు, నాయకులు బుచ్చిరెడ్డి, గోవర్ధన్ యాదవ్, గోపాల్, ప్రతాప్, సుధాకర్, వెంకటేష్, అనిత, రేవతి, వెంకట్, లక్ష్మణస్వామి, సుజాత, డాక్టర్ నరేందర్, శ్రీకాంత్‌గౌడ్, ఇస్మాయిల్, గోపాల్, మహేందర్‌రెడ్డి, మునీర్‌పాష, బాబు, వెంకటస్వామి పాల్గొన్నారు.

విమానంలో పేలుడు పదార్థం ఉందని బెదిరింపు

- బలగాల అప్రమత్తం.. ఏమీ లేదని నిర్ధారణ

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్నా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానంలో పేలుడు పదార్థం అమర్చామని జీఎంఆర్ అధికారులకు బెదిరింపు మెయిల్ వచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7:30గంటలకు పట్నా నుంచి 69 మంది ప్రయాణికులతో ఎయిర్‌పోర్టు చేరుకున్న ఇండిగో విమానంలో పేలుడు పదార్థం అమర్చామని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఎయిర్‌పోర్టు అధికారులకు ఈ-మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ప్రయాణికులను దించి విమానాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలేవని నిర్ధారించారు. ఇది ఆకతాయిల మెయిల్ అని అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాల్‌రాజ్ తెలిపారు.

ఫిరంగి.. కనుమరుగు

భారీగా ఆక్రమణకు గురైన ఫిరంగి కాలువ

- పట్టించుకోని రెవెన్యూశాఖ అధికారులు
- అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్
- ఫిరంగి కాలువ సర్వేకు స్థానికుల పట్టు
- శంకర్‌పల్లి మండలంలో 25.5 కి.మీ పరిధి

సాగు, తాగు నీరు అవసరాల దృష్ట్యా ఆనాటి నిజాం నవాబు శంకర్‌పల్లి మండలంలో ఫిరంగి కాలువను తవ్వించారు. నీటితో కళకళలాడే ఆ కాలువ కబ్జా కోర్లల్లో చిక్కుకుంది. కబ్జాచేసి నిర్మాణాలను చేపట్టడంతో పాటు, బఫర్ జోన్‌ను సైతం మాయం చేశారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లోకి వరద నీరు చేరుతోంది. ఈ ప్రాంతం ఔటర్‌కు సమీపంలో ఉండటంతో ఇక్కడ భూములను కొనుగోలు చేసిన బడాబాబులు, రాజకీయ నాయకులు పక్కనే ఉన్న ఫిరంగి కాలువను సైతం ఆక్రమించుకున్నారు. ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖల అధికారులు చోద్యం చూస్తున్న పరిస్థితి. ఇటీవల హైడ్రా తెరపైకి రావడంతో ఆక్రమణదారుల్లో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

కబ్జాల పర్వం 3


మీర్జాగూడ వద్ద ఫిరంగి కాలువ పక్కనే నిర్మించిన కట్టడం

శంకర్‌పల్లి, సెప్టెంబరు1: తాగు, సాగు నీటి అవసరాల కోసం నిజాం కాలంలో ఏర్పాటు చేసిన ఫిరంగి కాలువ(నాలా) ప్రస్తుతం పూర్తిగా కబ్జా కోరల్లో చిక్కుకుపోయింది. నిజాం ప్రభువు 1872లో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని ముందు చూపుతో ఏర్పాటు చేశారు. కానీ నేడు అది పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. బుల్కాపూర్ కత్వా నుంచి ప్రారంభమయ్యే ఫిరంగి కాలువ సుమారు మూడు దశాబ్దాల క్రితం భారీ వర్షాలు కురువడంతో వరద ప్రవాహానికి తెగిపోయింది. అప్పటి నుంచి కాలువలో నిత్యం ప్రవహించే మూసీ నీటి ప్రవాహం ఆగిపోయింది. అప్పటి నుంచి వర్షం నీరుపైనే ఆధారపడింది. తదనంతర కాలంలో వర్షాలు తక్కువగా కురవడంతో కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గి పోయింది. కబ్జాదారులు చెలరేగిపోవడం.. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువ పూర్తిగా ఆక్రమణకు గురైంది.

వెలసిన పెద్దపెద్ద కాంక్రీటు నిర్మాణాలు

ఈ కాలువ చుట్టుపక్కల భూములు కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి భూముల పక్కనుంచి వెళుతున్న ఫిరంగి కాలువపై కన్నేశారు. అనుకున్నదే తడవుగా కాలువను కబ్జా చేయడం ప్రారంభించారు. ఒకచోట కాలువ కబ్జాకు గురి కాగా, మరికొన్ని చోట్ల బఫర్ జోన్‌లోనూ పెద్దపెద్ద కాంక్రీటు

మిగతా 7వ పేజీలో...

స్థానిక ప్రజల అవసరాలతో పాటుగా హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో నిజాం ప్రభువు ఫిరంగి నాలాను ఏర్పాటు చేయించారు. అయితే మూసీనదిపై బుల్కాపూర్ వద్ద కత్వా నిర్మించి ఈ నాలను ఏర్పాటు చేయించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ వద్ద ఈ ఫిరంగి కాలువ ప్రారంభమవుతుంది. ఫిరంగి కాలువ బుల్కాపూర్‌తో పాటుగా మోకిల, పిల్లిగుండ్ల, గోపులారం, మహారాజ్‌పేట్, దొంతాన్‌పల్లి, జన్వాడ, మీర్జాగూడ, మియాఖాన్‌గడ్డ ద్వారా నార్సింగి మండలం పట్టినాగులపల్లి, ఖానాపూర్ గ్రామాల మీదుగా నగరంలోని ట్యాంకుబండ్ ద్వారా మూసీలో కలుస్తుంది. శంకర్‌పల్లి మండలంలో ఫిరంగి కాలువ సుమారుగా 25.5 కి.మీలు దూరం ప్రయాణిస్తుంది. ఈ కాలువ ప్రవాహ విస్తీర్ణం 8.5 మీటర్లు కాగా బఫర్ జోన్ కాలువకు ఇరువైపుల 9 మీటర్లుగా ఉంటుంది. అయితే ఇది ఒక్కోదగ్గర ఒక్కో రకంగా మారింది.

ట్యాంక్‌బండ్ ద్వారానే..

గంజాయి విక్రేతల రిమాండ్

ఆదిభట్ల, సెప్టెంబరు 1 : గంజాయి విక్రయిస్తూ శనివారం సాయంత్రం పట్టుబడిన ఇద్దరిని ఆదివారం ఆదిభట్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.లక్ష విలువచేసే 5.3 కిలోల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైలు వెంకటేష్, రాజులు వివరాలు వెల్లడించారు. ఒడిషాలోని మల్కాన్‌గిరి జిల్లా గంపకుండ గ్రామానికి చెందిన బిశ్వజిత్ మధు, అదే జిల్లా చార్ గ్రామానికి చెందిన సంతోష్ సర్కార్‌లు స్నేహితులు. మధుకు గంజాయి సేవించే అలవాటు ఉండగా.. తాను గంజాయి తీసుకుంటూనే ఇతరులకు విక్రయించేవాడు. సర్కార్ ఒడిషాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మధు ద్వారా ఆదిభట్ల పరిసర ప్రాంతాల్లో కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయించేవాడు. శనివారం సాయంత్రం కొంగరకలాన్ సమీపంలో ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్‌హాల్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు వెళుతుండగా మహేశ్వరం ఎస్వోటీ, ఆదిభట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి మధు, సర్కార్‌లను అదుపులోకి తీసుకున్నారు. గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న నిందితులను మాదక ద్రవ్యాల నిరోధక చట్టం ఎన్డీపీఎస్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పట్టభద్రులు, మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్బరంగయ్య(ఇన్‌సెట్లో)

సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశాభివృద్ధికి వినియోగించాలి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 1 : సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశాభివృద్ధి కోసం వినియోగించాలని వేద ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్బరంగయ్య తెలిపారు. మండలంలోని అంకుశాపూర్ సమీపంలోని ఏస్ కళాశాలలో ఆదివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సుబ్బరంగయ్య మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకుసాగాలని విద్యార్థులకు సూచించారు. మన మేధస్సు, సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశ శ్రేయస్సుకు వినియోగించాలని, పోటీతత్వ ప్రపంచంలో సాంకేతిక, వృత్తి, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అన్ని సంపదలు కాలానుగుణంగా కనుమరుగైపోతాయని, జ్ఞాన సంపదను ఎవరూ దోచుకోలేరని అన్నారు. ఏస్ కళాశాలలో 85 శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్ రావడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పొందిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఏస్ విద్యాసంస్థల కార్యదర్శి వైవీ గోపాలకృష్ణమూర్తి, సీవోవో ప్రభువంశీ, ప్రిన్సిపాల్ బీఎల్ రాజు, సంయుక్త కార్యదర్శి ఎం.పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులను త్వరగా ఛేదించండి : డీఎస్పీ

పెద్దేముల్, సెప్టెంబరు 1: చోరీ కేసులను త్వరగా ఛేదించి పోలీసుల పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. ఇటీవల జరిగిన చోరీ కేసు విషయమై ఇన్వెస్టిగేషన్ ఎంతవరకు వచ్చిందని ఎస్సై గిరిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వర్షాలపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, భారీవర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్పా.. ప్రజలను బయటకు రావద్దని సూచించాలని అన్నారు. అదేవిధంగా వర్షాలకు పొంగిపొర్లుతున్న వాగుల వద్ద రాకపోకలు సాగనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆంజనేయులు

వికారాబాద్, సెప్టెంబరు 1 : పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా వనంపల్లి ఆంజనేయులు ఎంపికయ్యారు. ఆదివారం వికారాబాద్ సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆంజనేయులుకి 184 ఓట్లు రాగా.. ప్రత్యర్థి వర్కల మల్లేశంకు 89 ఓట్లు పోలయ్యాయి. దాంతో సంఘం సభ్యులు ఆంజనేయులును జిల్లా అధ్యక్షుడిగా నియమించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికలో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వానా.. హైరానా!



గౌడవెల్లి వద్ద వంతెనపై నుంచి పారుతున్న వరద



పరిగి పట్టణంలోని సాయిరాం కాలనీలో చేరిన నీరు

● 5వ పేజీ తరువాయి..

చేపలు పట్టేందుకు చెరువులోకి దిగిన శేఖర్ అనే వ్యక్తి దుర్మరణం, అలాగే షాద్‌నగర్‌లోని నోబుల్ పార్క్ కాలనీలో వర్షపు నీటి గుంటలో పడి బాలుడు దుర్మరణం చెందాడు. కందుకూరు, జైత్వరం నాయిని వాణి చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

శంకర్‌పల్లిలో ఉప్పొంగిన మూసీ

శంకర్‌పల్లి మండలంలో మూసీ వాగుతో పాటు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో వర్షం నీరు రోడ్లపై చేరవడంతో జేసీబీలతో తవ్వించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, నర్సప్పగూడ వాగులు ఇదృతంగా ప్రవహించాయి. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షానికి చెరువులు, కుంటలు నిండాయి. దీంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు మండలం కత్వవాగు, కడ్తాల మండలం గొర్లకుంట చెరువులు అలుగు పారుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్‌లతో కలిసి కమిషనర్ వసంత శిథిల ఇళ్లను పరిశీలించారు. కందుకూరు మండంలోని జైత్వారం, పులిమామిడి చెరువలు అలుగు పారుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుంటంతో షాబాద్ మండలంలో మీరాపూర్, బొబ్బిలిగామ, కొమరబండ, చర్లగూడ, తదితర గ్రామాలకు వెళ్లవలసిన గ్రామస్థులు జంకుతున్నారు. నాగర్‌గూడ వద్ద ఈసీ వాగు జోరుగా ప్రవహిస్తోంది. చేవెళ్ల మండలంలోని ఆలూరు వాగు నిండుగా ప్రవహిస్తోంది. కౌకుంట్ల - తల్లారం గ్రామాల మధ్య ఉన్న వాగు ఉప్పొంగి రావడంతో రెండు గ్రామల మధ్య రాకపోకలు నిలిపివేసి వాగు వద్దకు ఎవరు రాకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. శంకర్‌పల్లి మండలంలో మూసీ భారీగా ప్రవహించడంతో ప్రొద్దుటూర్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురైయ్యారు. ఉమ్మడి కొందుర్గు మండలంలోని చించోడు- అయ్యవారిపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దూసకల్ పెద్ద చెరువు నిండి అలుగు పారింది. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గుర్రంపల్లి పెద్ద చెరువు నిండి అలుగు పారుతోంది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎదిర చెరువులోకి భారీగా నీరు చేరుతుండడంతో చెరువుకు నడిమి తూముకు గండి పడి నీరు వృథాగా పోతోంది.

కాలనీలు జలమయం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఏకధాటిగా ముసురుతో పాటు అక్కడక్కడ భారీ వర్షం కురిసింది. చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. మేడ్చల్ పెద్ద చెరువుకు వచ్చే గౌడవెల్లి వాగు ఉప్పొంగడంతో గౌడవెల్లి-మేడ్చల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్‌లో కాలనీలు జలమయమయ్యాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడటంతో పాటు నేలకూలాయి. జిల్లాలో వర్షాలతో ఎటువంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం జరుగలేదు. అధికారులు జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసి ప్రత్యేకాధికారులను నియమించారు. కురుస్తున్న వర్షాలకు పరిగి పట్టణంలో సాయిరాం కాలనీలో ఇళ్ల మధ్య భారీగా నీరు నిలిచింది. ఇళ్ల నుంచి బయటకు రాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పదుల సంఖ్యలో కూలిన ఇళ్లు

రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో పదుల సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి. మరికొన్ని చోట్ల గోడలు కూలి పాక్షికంగా దెబ్బతిన్నాయి. కేశంపేట మండలంలో ఎనిమిది ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ధ్వంసమైన ఈ ఎనిమిది ఇళ్లకు దాదాపు రూ.4లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని తహసీల్దార్ మీర్ అజాంఅలీ తెలిపారు. యాచారం మండలం నందివనపర్తిలో పాత ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని పలుగ్రామాల్లోనివాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాలకు మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌కు చెందిన యాదయ్య, కొడిచర్ల గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్ ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో సుమారు 20వరకు పాత మిద్దె కప్పులు, పాడుబడిన ఇళ్లు కూలిపోయాయి. పలు గ్రామాల్లో కుటుంబ సభ్యుల అప్రమత్తతో తృటిలో ప్రమాదాలు తప్పాయి. కొందుర్గు మండలంలోని వెలిజర్ల, నాగులపల్లి గ్రామాల్లో రెండు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయని ఆయన తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని గుర్రంపల్లిలో ఈరని చెన్నయ్య, ఈరని బాలకిష్టయ్యలకు చెందిన ఇంటి గోడలు వర్షానికి కూలిపోయాయి. అలాగే తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జోగు రాజ్ కుమార్ చెందిన ఇంటి గోడ కూలింది. మాడ్గుల మండలం అర్కపల్లి గ్రామంలో సీత లింగయ్యకు చెందిన ఇల్లు కూలిపోయింది.

కురుస్తున్న వర్షానికి కీసర గ్రామానికి చెందిన పుంద్రు నారాయణ ఇంటి గోడ కూలింది. నేలకూలింది. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో డప్పు రాములు ఇంటి ముందు ఉన్న పురాతనమైన పెద్ద వేప కూలి ఇంటి పై కప్పు పై పడింది. దీంతో ఇంటి గోడలు బీటలువారాయి, ఘట్‌కేసర్ మండలంలో బలమైన గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపోయాయి. పలుచోట్ల విద్యుత్ సరపరాకు అంతరాయం ఏర్పడింది. పెద్దేముల్ మండలంలోని హన్మాపూర్ గ్రామంలో ఎంజుగుల దస్తప్ప ఇళ్లు పాక్షికంగా కూలిపోయింది. అంతారం తండాలో వర్షానికి ఇంటి గోడ కూలింది

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో...

వికారాబాద్ జిల్లాలో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుంటలు, చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. జిల్లాలో కోట్‌పల్లి, నందివాగు, సర్పన్‌పల్లి ప్రాజెక్టులతో పాటు వికారాబాద్ శివసాగర్ అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. వాగులు కాజ్‌వేలపై నుంచి రహదారుల మీదుగా ఉధృతంగా ప్రవహించడంతో పలుమార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మూసీ, కాగ్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తాండూరు ప్రాంతం లో భారీ వర్షం కురియడంతో వాగులు పొంగి ప్రవహించడంతో సరిహద్దులోని కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయాయి. వికారాబాద్-నస్కల్-పరిగి, ధన్నారం-వికారాబాద్, మర్పల్లి-మోమిన్‌పేట్, అత్తాపూర్-చించల్‌పేట్, దోర్నాల్-ధారూరు, పరిగి-మహబూబ్‌నగర్, తాండూరు-చించో లి, తాండూ రు-రాస్నం రూట్లలో వాగులు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గొట్టిముక్కుల, గుబ్బడి ఫత్తేపూర్, ద్యాచారం, జిన్నా రం, మైలార్‌దేవరంపల్లి, గిరిగెట్‌పల్లి, కోట్‌పల్లి, నాగారం, విశ్వనాథ్‌పూర్, కోకట్, అల్లాపూర్, నూర్లాపూర్, ఆశమ్మ కుంట, జుంటుపల్లి, సిరిపురం, కోట్‌మర్పల్లి, తిమ్మాపూర్, మహంతిపూర్, చిట్లపల్లి, బండలవాగు, పోచమ్మ తం డా, బ్రాహ్మణపల్లి, గొడుగోనిపల్లి, దొంగ ఎన్కేపల్లి, వాగులు ఉధృతంగా ప్రవహించాయి. మహబుబ్‌నగర్ తాండూర్ రోడ్డు మార్గంలో పలుచోట్ల రో డ్డు తెగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు నీటిని తీసుకు వచ్చే ఏటి కాలువలో వరద ఉధృతి పెరగడంతో కాలువకు గండి పడగా, ఆ గ్రామ యువకులు, కాంగ్రెస్ నాయకులు జేసీబీతో మరమ్మతులు చేపట్టారు.పరిగి శివారులోని వాగు రోడ్డుపై ప్రవహించడాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ అశోక్, ఎస్‌ఐ సంతోష్‌లు పరిశీలించారు. పరిగి నియోజకవర్గంలో అవసరమున్న ప్రాంతాల్లో కొత్తగా బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

✦ గౌతాపూర్ శివారులో గల 33/11కేవీ సబ్ స్టేషన్, వీర్‌శెట్టిపల్లి, తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని సంగెంకలాన్ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మోత్కుల వాడుక వద్ద పాలిషింగ్ యూనిట్లు నీటిలో మునిగిపోయాయి. లోతట్టు గ్రామాలైన సంగెంకలాన్, కొత్లాపూర్, మల్కాపూర్, బెల్కటూర్, అల్లాపూర్, ఐనెల్లి, ఉద్దండాపూర్, గుండ్లమడుగుతండా, జినుగుర్తితండా, ఎల్మకన్నె, చం ద్రవంచ, చిట్టిఘనాపూర్, ఖాంజాపూర్ పరిధిలోని పంట పొలాలన్నీ చెరువులను తలపించాయి. నవాబ్‌పేట మండలం, గేట్‌వనంపల్లి వద్ద కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వద్ద మట్టికొట్టుకుపోయింది. తాండూరు మండలం, గౌతాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. జిల్లాలో పలు చోట్ల ఇళ్లకు పాక్షికంగా, రోడ్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి.

వికారాబాద్ జిల్లాలో చెరువుల వివరాలు	
అలుగు పారుతున్న చెరువులు	623
75 నుంచి 100 శాతం నిండినవి	235
50 నుంచి 75 శాతం నిండినవి	120
25 నుంచి 50 శాతం నిండినవి	89
25 శాతం లోపు నిండినవి	115
మొత్తం చెరువులు	1182

ఉమ్మడి జిల్లాలో నమోదైన వర్షపాతం (మి.మీ)

రంగారెడ్డి జిల్లా

మండలం	ప్రాంతం	నమోదు(మి.మీ)
కేశంపేట్	తొమ్మిది రేకుల	208.5
తొలకొండపల్లి	వెల్జాల్	146.5
నందిగామ	నందిగామ	137.0
తొలకొండపల్లి	చుక్కాపూర్	127.5
షాబాద్	షాబాద్	117.3
ఆమనగల్లు	ఆమనగల్లు	113.8
శంకర్‌పల్లి	పొద్దుటూరు	107.8
చేవెళ్ల	కందవాడ	107.0
కేశంపేట్	కేశంపేట్	103.0
షాబాద్	తాళ్లపల్లి	99.0
షాబాద్	చందనవెల్లి	99.0

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

కీసర	ఈఎస్ఎస్ కీసర	105.8
ఘట్‌కేసర్	గణపూర్	85.8
బాచ్‌పల్లి	ఈఎస్ఎస్ బాచ్‌పల్లి	81.0

వికారాబాద్ జిల్లాలో..

యాలాల్	దవలాపూర్	128.8
కుల్కచర్ల	ముజాహిద్‌పూర్	125.0
కొడంగల్	కొడంగల్	123.0
దౌల్తాబాద్	దౌల్తాబాద్	107.8
బషీరాబాద్	ఖాశీంపూర్	106.8
మోమిన్‌పేట్	మోమిన్‌పేట్	105.8
దోమ	దోమ	99.8

కొడంగల్‌లో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ

భారీ వర్షం కురిసిన కొడంగల్ నియోజకవర్గంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వరద నీటి ప్రవాహాన్ని వారు పరిశీలించారు. మహబూబ్‌నగర్ -తాండూరు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడడానికి దారితీసిన కారణాలపై ఆయన అధికారులతో ఆరా తీశారు. జిల్లాలో అతి భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ సూచనతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసు యంత్రాంగం ముందుగానే రంగంలోకి దిగింది. పొంగి ప్రవహించే వాగులు ఎవరూ దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు సిబ్బందిని నియమించారు. జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ధారూరు మండలంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం



మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మేడ్చల్ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఆదివారం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ముంద జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, అత్యవసరమైతే ప్రజలు9492409781 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. సోమవారం నేడు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్, సెప్టెంబర్ 1:వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు. నదులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు వాటి దగ్గరికి వెళ్లవద్దని సూచించారుప. ఊత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని, పాత ఇల్లలో నివసిస్తున్న వారు వెంటనే ఇంటిని విడిచి సమీపంలోని ప్రభుత్వ భవనాలు లేదా పాఠశాలలలో ఆశ్రయం పొందాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని స్పీకర్ ఆదేశించారు.

అత్యవసరమైతే 100కు కాల్ చేయాలి

జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఎవరికైనా అత్యవసరమైతే 100కు డయల్ చేయాలని లేదా కంట్రోల్ రూం నెంబర్ 8712670056 నెంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం భారీ వర్షాల కారణంగా పోలీసు అధికారులకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పొంగిపొర్లుతున్న వాగులు, నాలాలు దగ్గర రోడ్లను బ్లాక్ చేయాలని సూచించారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవునిపల్లి- చించోడు మధ్యలో ఉన్న పల్లె చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి అందులో పడి మృతి చెందాడు. దేవునిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల శేఖర్(35) ఆదివారం ఉదయం చెరువులో చేపలు పట్టెందుకు వెళ్లి చెరువులో మట్టి తీసేందుకు తీసిన గోతిలో పడి మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారంతో అక్కడికి వెళ్లిన ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ గ్రామస్తులతో గాలింపు చేయించి మృత దేహన్ని బయటికి తీశారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం మృతదేహన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.



చేపల వేటకు వెళ్లి మృతిచెందిన వ్యక్తి

వర్షం నీటి గుంతలో పడి బాలుడు..

తల్లిదండ్రుల ముందు ఆడుకుంటూ పక్కనే ఉన్న వర్షపు నీటి గుంతలో పడి 13నెలల బాలుడు మృతిచెందిన సంఘటన షాద్‌నగర్‌లోని నోబుల్ పార్క్ కాలనీలో చోటుచేసుకుంది. బిహార్‌కు చెందిన అక్తర్ మన్సూర్, రౌషన్ కతూం దంపతులు షాద్‌నగర్‌కు వలసొచ్చి నోబుల్ పార్క్‌లో ఓ ఇంటిలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఇంటి పక్కనే గుడిసె వేసుకుని ఉంటున్నారు. ఆదివారం వర్షం కురుస్తుండగానే వారి కుమారుడు అరీఫ్ మన్సూర్ ఆడుకుంటూ వర్షం నీటి గుంతలో పడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు.



కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న బక్కి వెంకయ్య

కుల వివక్ష చూపించిన టీచర్‌ను సస్పెండ్ చేయండి

డీఈవోకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకయ్య ఆదేశం

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 1: విద్యార్థినుల పట్ల కులవివక్ష చూపించిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య డీఈవోను ఆదేశించారు. శంషాబాద్ మండలంలోని పాల్మాకుల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని చైర్మన్ వెంకయ్య ఆదివారం సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించి, వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కొందరు విద్యార్థినులు చైర్మన్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల పట్ల కుల వ్యతిరేక భావం, వివక్ష చూపించిన ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని డీఈవోను ఆదేశించారు. అనంతరం ఎస్సై ఆనంద్‌కుమార్‌తో మాట్లాడారు. కులం పేరుతో దురుసుగా మాట్లాడి, హేళన చేసిన ఉపాధ్యాయురాలిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ కింద కేసు నమోదు చేయాలని సూచించారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బ్లీచింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుశీందర్‌రావు, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్, ఎంఈవో, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు అన్నిరంగాల్లో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

మొయినాబాద్, సెప్టెంబరు 1 : గౌడ కులస్తులు అన్నిరంగాల్లో ముందుకు సాగాలని, గౌడ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తెలిపారు. ఆదివారం మొయినాబాద్ మండల కేంద్రంలో గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం మొయినాబాద్ మండల గౌడ సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. మండలాధ్యక్షుడుగా బి.అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా అల్లం సత్యనారాయణగౌడ్, చిలుకూరి భిక్షపతిగౌడ్, యూత్ కమిటీ అధ్యక్షుడిగా చేగూరి విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బి.యాదయ్యగౌడ్, దేవేందర్‌గౌడ్ తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేవట్ల మల్లేషగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతి నర్సింహగౌడ్, ఉపాధ్యక్షుడు ఎల్లని అశోక్‌గౌడ్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పరిధిని వికారాబాద్ జిల్లాకు విస్తరించాలి

వికారాబాద్, సెప్టెంబరు 1: హైడ్రా పరిధిని వికారాబాద్ జిల్లాకు విస్తరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. నాగేందర్‌గౌడ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని శివసాగర్ చెరువు శిఖంలో అక్రమంగా వెలసిన వెంచర్లు, ఫామ్‌హౌస్ తదితర నిర్మాణాలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. పరిగిలో 28 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొత్త చెరువు నేడు 4 ఎకరాలకే పరిమితమైందన్నారు. సీఎం, స్పీకర్ ఈ జిల్లాకు చెందినవారు కావడంతో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. హైడ్రా తొలగించిన నిర్మాణాల్లో చాలావరకు పేద ప్రజలు ఉన్నారని, వారికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు.

ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

పరిగి, సెప్టెంబరు 1: ధర్మాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుందని, అందరూ ధర్మ మార్గాన్ని ఆచరించాలని రిటైర్డ్ డివిజనల్ స్టాటిస్టికల్ అధికారి మఠం మాణిక్‌ప్రభు అన్నారు. శ్రావణమాసం మాస శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం వీరశైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని శ్రీజలేశ్వర మహాస్వామి ఆలయంలో గురుపూజ, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా మాణిక్‌ప్రభుకు గురుపూజ చేశారు. అనంతరం శ్రీజలేశ్వర మహాస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం ఆధ్మాత్మిక సదస్సు నిర్వహించారు. సమాజం అధ్యక్షుడు నస్కల్ నటరాజ్, కార్యదర్శి సయ్యద్‌పల్లి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కాశీనాథ్, బాధ్యులు కేతకిలింగం, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజకు హాజరైన సభ్యులు

వీరభద్రేశ్వరాలయంలో 'లక్ష బిల్వార్చన'

ధారూరు, సెప్టెంబరు1: ధారూరులోని వీరభద్రేశ్వరాలయంలో భక్తులు ఆదివారం లక్షబిల్వార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలోని శివలింగానికి రుద్రాభిషేకం చేసి మారేడు బిల్వాలతో అలంకరించి నైవేద్యం సమర్పించారు. గణపతి, కుమారస్వామి, నందీశ్వరుడు, వీరభద్రేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు. పార్వతీదేవి విగ్రహానికి వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిగా అలంకరణ చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపించారు.

ఫిరంగి.. కనుమరుగు

● 5వ పేజీ తరువాయి..

నిర్మాణాలు చేపట్టారు. కాలువను కబ్జాచేస్తూ నీరు వెళ్లకుండా అడ్డుగోడలు నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల్లో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో నిరుపేదలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీసే పరిస్థితి దాపురించింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి జన్వాడ గ్రామంలోని హరిజనవాడ (కింది బస్తీ)లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోని వస్తువులు పాడవ్వడంతో పాటుగా నిద్దురలేని రాత్రులు గడిపిన సందర్భాలు ఉన్నాయి.

బడాబాబులే కబ్జాదారులు

శంకర్‌పల్లి మండలం ఔటర్‌రింగ్ రోడ్డుకు అతి సమీపంలో ఉండటంతో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఈ ప్రాంతంలో భూములను కొనుగోలు చేశారు. భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో కబ్జాలకు తెరతీశారు. కొనుగోలు చేసిన పట్టా భూముల పక్కన ఉన్న ఫిరంగి కాలువపై వారి కన్నుపడి కాలువను కబ్జా చేయడం ప్రారంభించారు. కబ్జా చేసి గోడలు నిర్మించడంతో అక్కడక్కడ కాలువ నామ రూపాల్లేకుండా పోయింది. బడాబాబులు, పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు, కేంద్ర, రాష్ట్రస్థాయి రాజకీయ నాయకులు, రాష్ట్ర స్థాయి మాజీ అధికారులు సైతం ఇందులో భాగస్వాములు కావడంతో నియంత్రించాల్సిన రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు జడుసుకుంటున్నారు. అక్రమ కట్టడాలను నియంత్రించాల్సిన అధికారులు బడాబాబులను ఎదుర్కోలేక చేతులు ముడుచుకుని కూర్చుంటున్నారు. అదే విధంగా ఆక్రమణదారులు అధికారుల చేతులు తడిపి కబ్జాలకు పాల్పడుతున్నారు. దీంతో కబ్జారాయిళ్లు ఆడిందే ఆటగా పాడిందే పాటగా తయారైంది. మీర్జాగూడలో ఫిరంగికాలువ పక్కనే పెద్ద భవనాలు నిర్మించినా అధికారుల్లో ఉలుకూపలుకూలేదు. మియాఖాన్‌గడ్డలో పైపులు వేసి కాలువను పూర్తిగా పూడ్చి వేసినా అధికారులకు కనబడని దుస్థితి. అలాగే మియాఖాన్ గడ్డలోనే కాలువను కబ్జా చేసి ప్రహరీలు నిర్మించింది రాష్ట్రస్థాయి నాయకులు కావడంతో అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు.



మియాఖాన్‌గడ్డ వద్ద పైపులు వేసి కాలువను పూడ్చిన తీరు

తక్షణం హద్దులు నిర్ణయించాలి

బుల్కాపూర్ కత్వా నుంచి మియాఖాన్‌గడ్డ వరకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పూర్తి వివరాలతో సర్వే చేసి ప్రవాహ విస్తీర్ణం, బఫర్‌జోన్ హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. బఫర్‌జోన్‌లో చేపట్టిన నిర్మాణాలను తొలిగిస్తేనే ఫిరంగి కాలువకు జవసత్వాలు వస్తాయని పలువురు తెలిపారు. అయితే ప్రస్తుతం ఫిరంగి కాలువ బఫర్‌జోన్‌లోని పలు గ్రామాలలో పెద్దపెద్ద నిర్మాణాలను బడా నాయకులు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోని దుస్థితి.

ఆక్రమణలను తొలగిస్తాం

ఫిరంగి కాలువ నేటికీ పూర్తి స్థాయిలో సర్వే జరగలేదు. సర్వే కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేయడం జరిగింది. సర్వే పూర్తికాగానే హద్దులు నిర్ణయించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తాము. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

\- పరమేశ్వర్, నీటిపారుదల శాఖ డీఈ



బుల్కాపూర్ వద్ద కత్వా కూలగా మిగిలిన ఆనవాళ్లు(ఫైల్)

111 జీఓ బుట్ట దాఖలు

జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లను పరిరక్షించేందు కోసం మూడు దశాబ్దాల క్రితం ఆనాటి ప్రభుత్వం 111జీఓను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కాగా, చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని 84 గ్రామాలు 111జీఓ పరిధిలోకి వస్తాయి. ఈగ్రామాలలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధన ఉండగా మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి సమయంలో వారికున్న భూమిలో 10 శాతం నిర్మాణాలు చేపట్టేందుకు సడలింపు ఇచ్చిన విషయం తెలిసిందే. కాంక్రీటుతో నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధన ఉన్నప్పటికీ ఆక్రమణదారులు ఇదేమి పట్టించుకోలేదు. వారు కొనుగోలు చేసిన భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలకు తెరలేపారు. అదే విధంగా ఫిరంగి కాలువ పక్కన సైతం నిర్మాణాలు చేపట్టితే నీటి పారుదల, రెవెన్యూ శాఖల నుంచి నిరంభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకుని నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఇదేమి అమలుకు నోచుకోవడం లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన హైదరాబాదు విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ (హైడ్రా) కబ్జాకు గురైన ఫిరంగినాలను కబ్జా కోరల్లో నుంచి విముక్తి చేయాలని పలువురు కోరుకుంటున్నారు.

కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కేంద్రం

ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్



మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్

ఆదిభట్ల, సెప్టెంబరు 1 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దివాలా తీయించే యత్నం చేస్తోందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి పరిధిలోని శుభం కన్వెన్షన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ్జూ మాట్లాడుతూ మోదీ ఆధ్వర్యంలో కేంద్రం వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు యత్నించే ఏ నిర్ణయాన్నీ సహించబోమన్నారు. సరళీకరణ, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటాలతో పాటు ప్రజలను చీల్చుతున్న మతోన్మాదంపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. దాని ఫలితంగా దేశవ్యాప్తంగా 1.12 లక్షల మంది రైతులు, 3.20లక్షల మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు తెలిపారు. నవంబరు 15 నుంచి 25 వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు, పది రోజుల పాటు పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాలు అందజేయాలని, నవంబరు 26న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి రాజధానిలో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, సీనియర్ నాయకులు జంగారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాంచందర్, మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు ముసిలయ్య, రామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శంషాబాద్ రూరల్: కేపీదొడ్డి-సుల్తాన్‌పల్లి రోడ్డుపై నుంచి ఉధృతంగా పారుతున్న ఎంబేరు వాగు


షాద్‌నగర్ అర్బన్, : న్యూసిటీ కాలనీలో నిలిచిన వర్షపు నీరు


మాడ్గుల: సుద్దపల్లి వాగును పరిశీలిస్తున్న పోలీసులు


మహేశ్వరం: అలుగు పారుతున్న కోళ్లపడకల్ చెరువు

పొంగిన వాగులు

● భారీ వర్షాలు ● చెరువుల్లోకి నీరు, రోడ్లపైనుంచి వరద ● కూలిన పాత ఇళ్లు

గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలాల్లోని చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకున్నాయి. ఆదివారం మొయినాబాద్ మండలం అమ్డాపూర్‌లో ఈసీ వాగు, చిన్నమంగళారం సమీపంలోని మూసీవాగు పరవళ్లు తొక్కింది. వానలతో టమాట, కూరగాయ పంటలు కొంతమేర దెబ్బతిన్నాయి. మహేశ్వరం మండలం కోళ్లపడకల్ చెరువు అలుగా పారుతోంది. కొందుర్గు మండల పరిధిలోని తంగళ్లపల్లి-వెంకిర్యాల, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి వాగులు ఉధృతంగా ప్ర వహస్తుండటంతో ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు చెక్ డ్యాముల్లోకి నీరు చేరుతోంది. మండలంలో పెద్దగా వాన పడలేదు. మాడ్గుల మండలంలోని సుద్దపల్లి వాగు పొంగుతోంది. పలు గ్రామాల్లో పురాతన ఇళ్లు కూలుతున్నాయి.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి, సెప్టెంబరు 1


కందుకూరు మండలం జైత్వారంలో పారుతున్న నాయిని వాణి చెరువు అలుగు


కడ్తాలలో అలుగు పారుతున్న గొర్లకుంట చెరువు


షాబాద్: జోరుగా పారుతున్న నాగర్‌గూడ వద్ద ఈసీ వాగు


షాద్‌నగర్ రూరల్: నిండుగా పారుతున్న చించోడు-అయ్యవారిపల్లి వాగు


కొందుర్గు : ఉధృతంగా ప్రవహిస్తున్న బైకులపల్లి వాగు


చౌదరిగూడ: ఉధృతంగా పారుతున్న తుమ్మలపల్లి వాగు.. దాటేందుకు ప్రయత్నిస్తు రైతులు


తలకొండపల్లి: చంద్రధనలో కూలిన లక్ష్మమ్మ ఇల్లు


కొత్తూర్: పొంగిపొర్లుతున్న మల్లాపూర్-పిల్లోని గూడ వాగు


ఆమనగల్లులో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వసంత


ఇబ్రహీంపట్నం: సాగర్ రహదారిపై శ్రీ ఇందు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద నిలిచిన నీరు


మొయినాబాద్ రూరల్: అమ్డాపూర్ వద్ద పారుతున్న ఈసీ వాగు


మాడ్గుల మండలం అర్కపల్లిలో కూలిన సీత లింగయ్య ఇల్లు


షాద్‌నగర్ అర్బన్: కాలనీలో వర్షపు నీటిని తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న


శంషాబాద్ రూరల్: ప్రవహిస్తున్న కేవీ దొడ్డి ఈసీ వాగు

కనుల పండువగా బోనాలు


తలకొండపల్లి: వెల్జాలలో బోనాలతో తరలుతున్న మహిళలు

యాచారం/తలకొండపల్లి/కందుకూరు/శంషాబాద్, సెప్టెంబరు 1: పలు మండలాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహిం చుకున్నారు. యాచారం మండలం నందివనపర్తిలో పెద్దమ్మ, మల్లన్న పోచమ్మ బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బెల్లం, నెయ్యి వంటకాలతో అమ్మవార్లకు, మల్లన్నకు బోనాల నైవేద్యం సమర్పించారు. ఒక్క పక్క చినుకులు కురుస్తున్నా మహిళలు బోనాలను మల్లన్నకు సమర్పించారు.ఉత్సవాల్లో బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకుడు కొంగళ్లజోగిరెడ్డి, న్యాయవాది యాదయ్య పూజలు చేశారు. మొగ్గుళ్లవంపులో పోచమ్మ బోనాల పండుగను జరిపారు. నాయకులు నందురెడ్డి, రాంరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో రామాసి మైసమ్మ బోనాల పండగను నిర్వహించారు. ఉత్సవా ల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గూడూరు శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పూజలు చేశారు. జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ముబ్బుర్ రహెమాన్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ కూన రవి, శ్రీను, అవినాష్‌గౌడ్, నగేష్, శ్రీకాంత్, సుల్తాన్, మారుతి రవి, రాజు, విజయ్‌కుమార్, విజయ్‌యాదవ్ పాల్గొన్నారు. కందుకూరు మండలం దాసర్లపల్లిలో పోచమ్మ, మైసమ్మ బోనాలను జరుపుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మాజీ సర్పంచ్ పి.బాలమణిఅశోక్, ఎంపీటీసీ టి.ఇందిరదేవేందర్ ఏర్పాట్లు చేశారు. శంషాబాద్‌లోని పురాతన వెండికొండ సిద్ధేశ్వరస్వామి జాతర కొనసాగుతోంది. శ్రావణమాస చివరి శని, ఆది, సోమ వారాల్లో మూడు రోజులు జాతర నిర్వహిస్తారు. పూజారి నరేందర్ పూజలు చేయగా ప్రవీణ్, రాఘవేందర్ దండకాలు చదివారు.

మఫిసిల్ జర్నలిస్ట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాస్

షాద్‌నగర్, సెప్టెంబరు 1: తెలంగాణ మఫిసిల్ జర్నలిస్ట్ కమిటీ కన్వీనర్‌గా షాద్‌నగర్‌కు చెందిన గుడుపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం సూర్యపేటలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సమావేశం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ శ్రీనివాస్‌ను కన్వీనర్‌గా ప్రకటించారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

'భావితరాల కోసం హైడ్రా పనిచేస్తోంది'

కందుకూరు, సెప్టెంబరు 1: భావితరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఆధ్వర్యంలో హైడ్రా పనిచేస్తోందని, మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయాలని, లేదంటే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని జిల్లా కోర్టు న్యాయవాది బొక్క మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కందుకూరులో మాట్లాడారు. హైడ్రాతో పేద, మధ్య తరగతి ప్రజలు బలవుతున్నారని అన్నారు. నిరుపేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్న సంవత్సరం అనంతరం ఇంటి యజమానికి పూర్తి హక్కులు వస్తాయన్నారు. చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్‌లలో ఇళ్లు, అపార్టుమెంట్లు ప్రజలకు అమ్మిన వారి నుంచి డబ్బులు ఇప్పించి ఇళ్లు కూల్చాలన్నారు.

తూము గండిని పూడ్చిన గ్రామస్తులు

చౌదరిగూడ, సెప్టెంబరు 1: కురుస్తున్న భారీ వర్షానికి చెరువులోకి భారీగా నీరు చేరింది. ఆదివారం ఎదిర చెరువుకు గండి పడి నీరు వృథాగా పోతోందని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఇరిగేషన్ అధికారులకు తె లిపారు. అయితే ఇరిగేషన్ అధికారులు రాకపోవడంతో గ్రామస్థులు చెరువు గండికి కంకర, వరిగడ్డి వేసి పూడ్చారు. గండిని పూడ్చిన వారిలో గండె వెంకటేష్ రామస్వామి, రాజు, జనార్ధన్, అంజయ్య, చందు, నరేష్, ముకుందరెడ్డి, దశరథం, బండెయ్య, కార్తీక్‌రెడ్డి, రమేష్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్


స్థానికులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే సబితా రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 1: కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆదివారం అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు, సిబ్బంది తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలతో పంటలు నష్టపోతే రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని కోరారు.

చేవెళ్ల: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అ న్నారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలన్నారు. వాగులు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లొద్దన్నారు. పాత ఇళ్లలో ఉండొద్దని, పాతిళ్లలోని వారు ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో ఉండాలన్నారు.

మహేశ్వరం: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కరెంటు స్తంభాలు, భారీ చెట్లు, మ్యాన్ హోళ్లు, విద్యుత్ తీగల సమీపంలో ఉండొద్దన్నారు. పాత ఇళ్లలో ఎవరూ ఉండకూడదన్నారు.

షాద్‌నగర్:వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఇళ్లు కూలిన వారికి ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేస్తామన్నారు. వారికి కొత్త ఇళ్లు కట్టిస్తామన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కేశంపేట మండలంలో 8ఇండ్లు, ఫరూఖ్‌నగర్‌లో రెండు, చౌదరిగూడలో 3 ఇండ్లు కూలాయని, వీరందరికీ సోమవారం ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా తనకు తెలపాలన్నారు.

మంచి పనులకు చిరస్థాయి కీర్తి


కుటుంబానికి ఆర్థికసాయంఅందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 1 : జీవితకాలంలో చేసిన మంచి పనులతో మరణానంతరం కూడా కీర్తి లభిస్తుందని షాదన్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ కల్యాణం మల్లయ్య పోలీసు శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయం అన్నారు. కడ్తాల పోలీసుస్టేషన్‌లో విధుల్లో ఉండగా గుండెపోటుతో గత నెల 21న మృతిచెందిన మల్లయ్య సంతాప కార్యక్రమాన్ని ఆదివారం హైదరాబాద్ జిల్లెల్లగూడలోని ఆయన నివాసంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఏసీపీ, సీఐ శివప్రసాదవ్, ఎస్ఐ వరప్రసాద్ హాజరయ్యా రు. మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఏసీపీ లిమిట్స్‌లోని పోలీసు అధికారులు రూ.3.5లక్షలు సమకూర్చి ఆయన భార్య విజయరాణి, పిల్లలకు ఏసీపీ అందజేశారు. మల్లయ్య కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు నిరంజన్, ప్రసాద్‌సీ. పోలీ సు సిబ్బంది పాల్గొన్నారు. కాంగ్రెస్ తరఫున మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, జహంగీర్‌అలీ, చందులాల్, జగన్, రవి రూ.30వేలు అందజేశారు. బీఆర్‌ఎస్ తరఫున రూ.32 వేలను మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ వైస్‌ఎంపీపీఆనంద్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు అందజేశారు.

'శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో అన్నిట్రైన్‌లు ఆగేలా చూడాలి'

చేవెళ్ల/శంకర్‌పల్లి, సెప్టెంబరు 1: శంకర్‌పల్లి మండల ప్రజలకు రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ నాయకులు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసివినతి పత్రం అందించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే రత్నం ఆధ్వర్యంలో మండల నాయకులు హైదరాబాద్‌లో ఎంపీకి వినతిపత్రం అందించారు. శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌లో బీజాపూర్, వాడి ప్యా సింజర్లు, హుబ్లీ టు సికింద్రాబాద్, తదితర ట్రైన్‌లు ఆపక ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్ని ట్రైన్లను శంకర్‌పల్లి స్టేషన్‌లో ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. ఎంపీ స్పందించి రైల్వే జీఎంతో మాట్లాడి రైల్లు ఆగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సంక్షిప్తంగా...

● **చౌదరిగూడ:** కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, వ్యవసాయ కూలీలు అప్రమత్తం గా ఉండాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లేడ్ చౌదరిగూడ మండల ప్రజలు, వ్యవసాయ కార్మికులు, ప్రయాణికులు రోడ్లు దాటే సందర్భంలో ప్రమాదాలకు గుర య్యే అవకాశాలు ఉంటాయన్నారు. వర్షాల సమ యంలో పనులను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

● **తలకొండపల్లి** : భారీ వర్షాలతో ఇళ్లు కూలి నిరాశ్రయులైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో ఇళ్లు కలిజిన బాధిత ఆయన పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన నిత్యావసర సరుకులను అందజేశారు. రూ.వెయ్యి చొప్పున అందించారు. జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముజ్బుర్ రహెమాన్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ రవి, శ్రీను, విజయ్‌కుమార్, శ్రీకాంత్, యాదయ్య, విజయ్, సుల్తాన్, శేఖర్, చెన్నయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

● **యాచారం:** మల్కీజ్‌గూడ మాజీ సర్పంచ్ వి.మల్లేష్ ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆయన 1995 నుంచి 2001వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన కాంగ్రెస్ వాదిగా ఉండేవారు.

● **ఆమనగల్లు:** మనిషి మరణించినా కల్లు సజీవంగా ఉండాలని మరణించిన వ్యక్తి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు. లయన్స్ క్లబ్ పీఆర్వో పాషా తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్‌లో స్థిరపడ్డ జడ్చర్లకు చెందిన విఠలయ్య మృతిచెందాడు. లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ అర్థం మనోహర్, శ్రీధర్ సూచనల మేరకు విఠలయ్య కళ్లను కంటి వైద్య సహాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సేకరించి కంటి ఆసుపత్రికి అందజేశారు. మృతుడి నేత్రాలను ఐ బ్యాంక్‌కు అందజేసిన విఠలయ్య కుటుంబాన్ని అభినందించారు.

● **ఆమనగల్లు:** అంధత్వ నివారణ కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతుందని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ దామోదర్‌రెడ్డి తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తిమ్మరాశిపల్లిలో కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలై 30న నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన 27 మందికి కళ్లద్దాలు అందజేశారు. జోన్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, దామోదర్ రెడ్డి అద్దాలను పంపిణీ చేశారు. కార్యదర్శి మహేశ్, కోశాధికారి నరసింహ, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

● **ఆమనగల్లు:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మున్సిపల్ కార్మికులు తడుస్తూ పని చేస్తున్నారు. ఆమనగల్లుకు చెందిన శ్రీదుర్గా భవానీ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం కార్యాలయం వద్ద కార్మికులకు ఉత్సవ కమిటీ సభ్యులు రెయిన్ కవర్లను పంపిణీ చేశారు. కార్యకమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రవీణ్, శ్రీశైలం, టిల్లూ యాదవ్, అప్పి, మధు, కుమార్‌గౌడ్, సాయి, శ్రీకాంత్ ఉన్నారు.

● **ఆమనగల్లు:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆమనగల్లుతో పాటు మండలంలోని గ్రామాలలో ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో జాగ్రత్తలు చేపట్టారు. వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న మేడిగడ్డ-శంకర్‌కొండ కత్వవాగును ఎస్ఐ సందర్శించారు. వాగువద్ద రోడ్డు మధ్యలో నుంచి నీరు ప్రవహిస్తుండడంతో ముందు జాగ్రత్తగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. గిరిజనులు చేపల వేటకు, యువకులు రీల్స్ కోసం వాగు వద్దకు వెళ్లకూడదని , పాత ఇళ్లలో ఉండొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాల్‌రెడ్డి, నాయకులు విజయ్‌రాథోడ్, భాస్కర్, సిద్దు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● **మాడ్గుల:** మండలంలోని అర్కపల్లికి చెందిన జమలాపురం రాంకిషన్ ఇటీవల బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల బీజేపీ ఆధ్వర్యంలో రాంకిషన్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

రోడ్డుపై వరినాట్లు వేసి చెన్నారం వాసుల నిరసన



తలకొండపల్లి, సెప్టెంబరు 1: చెన్నారం గ్రామస్తులు ఆదివారం రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. పాడైన రోడ్డుకు నెలల తరబడి మరమ్మతు చేయడంలేదన్నారు. ఆమనగల్లు మండలం విఠాయిపల్లి నుంచి చెన్నారం రోడ్డు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదన్నారు. వర్షాలకు రోడ్డు బురదమయంగా మారిందని ఆదివారం చెన్నారం మాజీ సర్పంచ్ స్వప్నభాస్కర్‌రెడ్డి, రమేశ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

క్రైం కార్నర్

హైనా దాడి.. రెండు లేగదూడల మృతి



లేగదూడల కళేబరాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ సుధాకర్‌రెడ్డి

తలకొండపల్లి, సెప్టెంబరు 1: హైనా దాడిలో రెండు లేగదూడలు మృతి చెందగా మరో దూడ మృత్యువుతో పోరాడుతోంది. వివరాల్లోకి వెళ్తే.. మాదాయిపల్లికి చెందిన రైతులు ఆనంద్, నెహ్రూబాబు శనివారం రాత్రి తమ పొలాల వద్ద కొట్టంలో పశువులను కట్టేసి ఇంటికి వచ్చారు. ఆదివారం తెల్లారి వెళ్లి చూడగా ఆనంద్‌కు చెందిన రెండు లేగను ఏదో మృగం చంపేసింది. నెహ్రూబాబుకు చెందిన మరో దూడను గాయపర్చింది. చనిపోయిన లేగల విలువ రూ.50వేలు ఉంటుందని ఆనంద్ తెలిపాడు. అడవి జంతువు దాడిపై రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. మాజీ సర్పంచ్ రామస్వామి కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలకు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో డీఎఫ్‌ఓ సుధాకర్‌రెడ్డి, ఎఫ్‌డీవో వేణుమాధవ్, డీఆర్‌వో జగన్మోహన్, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, ఎఫ్ఎస్‌వో అన్వర్ హుస్సేన్‌లు అక్కడికి చేరుకొని పరిశీలించారు. జంతువు పాదముద్రల ఆధారంగా లేగలను చంపింది హైనాగా గుర్తించారు. హైనాను త్వరలోనే బంధిస్తామని, పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లొద్దని అధికారులు సూచించారు.

కరెంట్ షాక్‌తో మేక మృత్యువాత

మాడ్గుల, సెప్టెంబరు 1: హైమాస్ట్ లైట్ స్తంభానికి మేక తగలడంతో కరెంట్ షాక్ కొట్టి మృతిచెందిన సంఘటన ఇర్విన్‌లో చోటుచేసుకుంది. ఆదివారం ఇర్విన్‌కు చెందిన చిందుల లక్ష్మయ్య మేకలను తోలుకుపోతున్న సమయంలో హైమాస్ట్ లైట్ పోల్‌కు మేక తగిలి షాక్ కొట్టి చనిపోయింది.

దాడి కేసులో నిందితుల రిమాండ్

కొత్తూర్, సెప్టెంబరు 1: మండలంలోని జేపీ దర్గా వద్ద ఈ నెల 30న జరిగిన దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. ఓ చానల్ రిపోర్టర్ ఫయాజ్ మునావర్ అతడి అనుచరులు మీర్జా షౌకత్, సదాక్ అలియాస్ సాదిక్, హర్షద్, సయ్యద్, జమీల్‌అన్సారీ, అఖిల్ అన్సారి మరికొందరితో కలిసి వసూళ్లకు పాల్పడుతూ దర్గా వద్ద సబ్ కాంట్రాక్టర్లలైన హబీబ్, రఫీక్, నవాజ్, సయ్యద్, మహమూద్, అజ్మత్‌లను డబ్బు డిమాండ్ చేసి దాడి చేసి గాయపరిచారని పేర్కొన్నారు. నిందితులను ఆదివారం తిమ్మాపూర్ వద్ద పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు

కందుకూరు, సెప్టెంబరు 1: పెద్దమ్మతండాలో పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకొని రెండు ప్యాక్‌సెట్లు, రూ.73,490 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు. పెద్దమ్మతండాలోని శనివారం అర్ధరాత్రి గూడె మల్లయ్య అనే రైతు పశువుల కొట్టంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. మహేశ్వరానికి చెందిన కొందరు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. రెండు ప్యాక్ సెట్లు, నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.